# ఏకదంతం

మధ్యాహ్నం మూడు గంటలవేళ. హెడ్ కానిస్టేబులు ఏకదంతం వచ్చి, పోలీసుస్టేషను గుమ్మం మెట్లెక్కి నుంచున్నాడు. వెనక్కి తిరిగి రోడ్డుమీదే ఆగిపోయిన గుంపును చూసి "రండయ్యా రండి, అట్లా చూస్తా నుంచుంటారేంటి?" అని అరిచాడు. ఆ గుంపులో ఉన్నవాళ్లంతా ఒక ఇరవైమంది నూనూగు మీసాల కాలేజీ కుర్రాళ్ళు. ఒకణ్ణి రెక్కపట్టుకుని లాక్కొచ్చారు. ఇంకోడు రిక్షాలో బాధతో మూలుగుతూ కూర్చొనున్నాడు. వాడి ఎడమ బుజానికున్న రుమాలు కట్టంతా రక్తసిక్తమైపోయి ఉంది. ఈ కలవరానికి లోపల కూర్చున్న ఎస్.ఐ. తలెత్తి చూసాడు. "ఏంటదీ?" అన్నాడు.

ఏకదంతం అటెన్షన్‌లో కొచ్చి సెల్యూట్ చేసి, "యస్సార్, మర్డరు కేసండి!" అన్నాడు ఆతృత ఉట్టిపడేట్టు. కుర్చీకి చారగిలబడి కూర్చున్నవాడల్లా హఠాత్తుగా ముందుకు వంగాడు యస్.ఐ. గుంపు వైపు తీక్షణంగా చూస్తూ అన్నాడు. "చచ్చాడా, బతికాడా?".... "బతికే ఉన్నాడు సార్. పొడిసినోడు కూడా దొరికాడు సార్"... "లోపలికి తీసుకురా"... ఏకదంతం అధికారంతో అరిచాడు : "రండయ్యా చెప్పేది మీగ్గాదేంది? పసుబ్బూసి బొట్టెట్టి పిలవాలా ఏంటి?... పాపం, ఆ సన్నాసిని కూడా దింపండి.".... తప్పని సరైనట్టు నెమ్మదిగా కుర్రాళ్లు ఒక్కొక్కళ్లూ వెనక్కు వెనక్కు చూసుకుంటూ లోపలికొచ్చారు. వస్తూ వస్తూ బుజం మీద కట్టున్నవాణ్ణి రిక్షాలోంచి దింపి నడిపించుకుంటూ తీసుకొచ్చి బల్లమీద కూర్చోబెట్టారు. వాడి పక్కన కొంత మంది నిలబడితే, మరి కొంతమంది ఇంకో గుంపుగా పక్కగా నుంచున్నారు.

యస్.ఐ. లేచి వాళ్ల దగ్గరగా వెళ్లాడు. కట్టున్నవాణ్ణి చూస్తూ "నిన్నేనా పొడిచింది? ఎక్కడ... బుజంమీదనేగా?" అన్నాడు.

"అవునండి."

"ఎవరు పొడిచింది?"

ముగ్గురు కుర్రాళ్లు ఏకకంఠంతో, "అతనేనండి, ఆఖువాహనం" అని చెప్పి, రెండో గుంపులో కొంత బెదురుగానూ, కొంత నిర్లక్ష్యంగానూ చూస్తున్న కుర్రాణ్ని చూపించారు. వాడిచుట్టూ ఓ అరడజను మంది మూగి ఉన్నారు.

యస్.ఐ. ఆఖువాహనాన్ని చూస్తూ "నువ్వా? నీ పేరు... ఏంటీ..... ఆఖువాహనమా? నువ్వేనా పొడిచింది?"... చటుక్కున గొంతెత్తాడు ఆఖువాహనం : "నేను పొడవాలని పొడవలేదు. అసలిది మర్డరు కేసుకాదు. మీ హెడ్డు మమ్మల్ని ఊరికేనే తీసుకొచ్చాడు. మమ్మల్ని కేసులో ఇరికించటం అన్యాయం!" కానిస్టేబులు ఏకదంతం చటుక్కున లాఠీ ఎత్తి దింపుతూ కంగారుగా అన్నాడు : "ఏంటే, ఏంట్రోయ్, ఎందాకా ఉందేంటి యెవ్వారం? ఎలిగేసను మాటలు మాట్టాడావంటే సితకబాదిసేగల్ను. ఏటనుకుంటన్నావో? ఆ యబ్బాయిని పొడిచేసి నువ్వు పారిపోతూవుంటే 'సచ్చాన్రా దేవుడో' అని ఆడు ఏడుత్తా ఉంటే, ఆడి ఫ్రెండ్సు నన్ను పిలిత్తే, సటుక్కునొచ్చి నేన్నిన్ను పట్టుగున్నాను.... ఇది మర్డరుకేసు కాపోతే మారేజి ఊసా? నాయాన్ని కాపాడేవోణ్ణి కాబట్టి నాడూటీ నేను సేసాను..... అయ్యగారున్నారు కాబట్టి సరిపోయింది. కాకపోతే ఈపాటికి నిన్ను... "

అఖువాహనం అన్నాడు : "లేకపోతే ఏం చేస్తావు? నువ్వేంచేస్తే అదే న్యాయమా? చెప్పే న్యాయమేదో అక్కడ చెప్తే మేం కాదన్నామా? తీసుకొచ్చి కేసులో ఇరికించటం దేనికి?"... యస్.ఐ అన్నాడు : "ఇదిగో మిస్టర్, నువ్విక్కడ మాట్లాడాల్సింది నాతో... అసలేం జరిగింది? దాచకుండా అంతా చెప్పేయ్ "... ఏకదంతం చిన్నబుచ్చుకున్నాడు.

అఖువాహనం అన్నాడు : "మేము.... అంటే... ప్రైవేటు కాలేజీ స్టూడెంట్సుమండి. మేమంతా ఒకే లాడ్జివాళ్లం. మేము వినాయకచవితి జరపాలనుకున్నాం. పెద్ద విగ్రహం చేయించాం. మా లాడ్జి ముందర పందిరి వేసాం. డెకరేషనూ అదీకూడా చేసాం. సరిగ్గా అప్పుడే వీళ్ళు మాతో పోటీ కొచ్చారండి.....'

"వీళ్లెవరు?"

"వీళ్ళు గవర్నమెంటు కాలేజీ కుర్రాళ్లండి... అసలు మా ఫ్రెండ్సేనండి మొదట్లో! మేమంతా కలిసే మొదలుపెట్టామండి. కానీ మధ్యలో వాళ్లల్లో ఎవడో నాకూ, ఈ ఉమాకుమార్ గాడికీ మధ్య పుల్లబెట్టి మమ్మల్ని దూరం చేసాడు. దాంతో వాడు మా వీధిలోనే వాళ్ల లాడ్జి ముందర పందిరేసి తమకు వేరే విగ్రహాన్ని పెట్టుకున్నారు...."....యస్.ఐ. మొహంలో కోపంపోయి కుతూహలం తొంగిచూసింది. అఖువాహనం మళ్లీ మొదలుపెట్టాడు :"ఇహ దాంతో మేము, పేచీ ఎందుకులే, ఎవరు చేసినా ఆ వినాయకుణ్ణి కొలవటమేగదా అని ఊరుకున్నామండి... కానీ, ఆ ఉమాకుమార్గాడు ఊరు కోలేదు.."

"ఉమాకుమార్ ఎవరు?" ఎస్.ఐ. అడిగాడు. మొదటి గుంపులో కుర్రాళ్ళు భుజం మీద కట్టున్న కుర్రాణ్ణి చూపిస్తూ "ఇతనేనండి!" అన్నారు. ఇంతవరకూ సన్నగా వస్తూన్న ఉమాకుమార్ మూలుగు ఇప్పుడు కొద్దిగా పెరిగింది. అఖువాహనం వాడివైపు చూస్తూ సన్నగా "ఏడిసావ్, సన్నాసీ, నీ పేరెత్తగానే మూలుగెక్కువైందే?" అంటూ మళ్లీ గట్టిగా 'రేపే గదా చవితి అని ఇవ్వాళ మా పందిట్లో డెకరేషన్ చేసుకుంటున్నామండి. ఇందాకన ఈ ఉమాకుమార్ వీళ్లందరితోనూ మా పందిట్లోకొచ్చి, 'పెద్ద పోటుగాడిలాగా డామినేట్ చెయ్యాలనుకుంటున్నావు, నీ బూజు దులిపేస్తా... ఏదీ, అగజానన పద్మార్కం శ్లోకానికి అర్థం చెప్పు!' అన్నాడండి. అసలర్థం నాకు తెలుసు. అయినా వాణ్ణి ఏడిపిద్దామని ఇట్లా చెప్పానండి : గజం కన్నా తక్కువకాని పొడుగున్న పద్మం కలవాడు, గజం పొడుగున్న మొహంకలవాడు, అయినా భక్తులకు ఒక్క దంతంతోనే కనిపించేవాడు అయిన విఘ్నేశ్వరుడికి ఉప్మాపెట్టి హారతిస్తున్నాను - అని చెప్పాను. వాడు కొంచెం తికమక పడ్డాడు. అన్నాడూ, 'మరి ఘంటసాల, అనేక దం-తం అని చదివాడు గదా, దాని అర్థం అనేకసార్లు దం-తం, దం-తం అని నాట్యం చేసేవాడు అని గదా, నువ్విట్లా చెబుతున్నావేమిటీ మరి?' అని. అప్పుడు నేను ఎదురు ప్రశ్న వేసానండి. 'అగజానన పద్మం అంటే గజం కన్నా తక్కువ కాని పొడుగున్న పద్మమనే విషయాన్ని ఒప్పుకొన్నట్లేనా?' అని. 'ఎందుకొప్పుకోను?' అన్నాడండి. 'అంటే ఎంతుండాలంటావ్?' అన్నానండి. 'రెండు గజాలో మూడు గజాలో ఉంటుందనుకొంటాను? అన్నాడు. 'అందుకనే నీకు గవర్నమెంటు కాలేజీలో సీటొచ్చిందనుకుంటాను' అన్నానండి. హఠాత్తుగా వాడు మొహం కండలు చించుకుంటూ 'నన్ను లక్ష అను పడతాను గవర్నమెంటునంటే మాత్రం ఒప్పుకోను. ఇది మా అమ్మ గవర్నమెంటు. మా గవర్నమెంటు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు రాస్కెల్.' అన్నాడండి. 'నోర్ముయ్యరా వెధవా' అన్నానండి ఇంక అంతేనండి, కోతుల్లాగా వాళ్లంతా మా పందిట్లో పడిపోయి, మా డెకరేషన్ అంతా తెంపేసి, తుంపేసి పాడుచేసేసారండి."

"మరి మీరు అడ్డుపడలేదా"

"అప్పుడు మా పందిట్లో నేనొక్కడ్నే ఉన్నాను గదా! తంతారేమోనని జడిసి ఊరుకున్నానండి. కానీ నాకు మాత్రం ఒళ్లు మండిపోయిందండీ."... రుమాలు చాటున ముసి ముసి నవ్వుల్ని దాచుకుంటూ అన్నాడు యస్.ఐ. "అగజానన శ్లోకం అసలర్థం ఏమిటి?"..... "అసలర్థమాండి! .... పర్వతరాజు కూతురు యొక్క మొహమనే పద్మానికి సూర్యుని వంటివాడు, ఏనుగుతల కలవాడు, ఎల్లప్పుడూ భక్తులకు అనేక వరాలను ఇస్తూ ఉండేవాడు అయిన ఏకదంతుడ్ని కొలుస్తున్నాము అని"..." ఆ తర్వాత."

"వాళ్లు వెళ్ళిపోయిన కాస్సేపటికి మా ఫ్రెండ్సు - వీళ్లంతా వచ్చారు. మేమంతా వాళ్ల పందిట్లోకి వెళ్లాం. వాళ్లడెకరేషన్ పాడుచెయ్యాలని ప్రయత్నించాం. నేను నా బాకుతీసి వాళ్ల వినాయక విగ్రహానికి కట్టిని పాలవెల్లిని కొయ్యబోయాను. అది మొండి చాకండి, పర పరా నేను కోస్తూంటే ఈ ఉమాకుమార్ వెధవొచ్చి నాతో కలబడ్డాడండి. అదివాడ బుజానికి కొంచెం గుచ్చుకుందండి...."...."లోపలికి దిగిందా?'... "ఏమో, దిగలేదనుకుంటాను. .... గీసుకుందంతే."..... టక్కున ఉమాకుమార్ గుంపులోంచి ఒకడందుకొన్నాడు : "అరంగుళం దిగిందండి."

వెంటనే హెడ్డు ఏకదంతం అన్నాడు : "అరంగుళమేంటయ్యా, అరంగుళాలు దిగితేను!..... సరింగా చెప్పండి. మూసిపెడితే మాసిపోద్దేంటి?"... "నువ్వు కాసేపు నోరు మూస్తావా ఏకదంతం?" అంటూ యస్.ఐ., "ఊఁ నువ్ కానీ" అన్నాడు.

అఖువాహనం అందుకున్నాడు. "వాడప్పుడు గట్టిగా అరుస్తూ ఏడవటం మొదలు పెట్టాడండి. అప్పుడే దారిన పోతున్న ఈ హెడ్డుగారు లోపలికొచ్చాడు. 'మర్డరా?' అని అడిగాడు. చటుక్కున నన్ను పట్టుకుని తన పెన్ను ఇంకుతో తన డైరీలో నా వేలిముద్ర వేయించుకున్నాడు. ఉమాకుమార్‌ని ఇంకో ఇద్దర్నీ పక్కకి తీసికెళ్లి వాళ్లతో ఏదో మాట్టాడాడు. ఆ తర్వాత మమ్మలందర్నీ ఇక్కడికి లాక్కొచ్చాడు. నిజానికి ఈ రకం కేసు పెట్టాలని వాళ్లు అనుకోలేదండి. నేను మర్డరు గురించే ఆలోచించలేదండి."..... ఏకదంతం చటుక్కున అన్నాడు : "అబద్ధం, అబద్ధం!... నేను అక్కడ డెకరేషను చూస్తానుంచునున్నాను. నువ్వు అతగాడిమీదపడి చటుక్కున బాకు దీసి పొడిసిపారేసావు. ఏంటయ్యా, మీరు మాట్లాడరేంటయ్యా!.... దెబ్బతిన్నోళ్లు మాట్లాడకపోతే మద్దిన నాకేంటయ్యా!" ఉమాకుమార్ గుంపులోంచి ఒకడు తలొంచుకొని, నీళ్ళు నములుతూ అన్నాడు : "అవున్సార్, హెడ్డు గారు చెప్పిందే నిజం!".... అఖువాహనం కోపంతో ఊగిపోయాడు : "ఒరే సన్నాసులూ, అబద్ధం చెప్పి నన్ను జైల్లో తోయించెయ్యాలని చూస్తున్నార్రా! రాస్కెల్స్, ఇక్కడ స్టేషన్లో కాదురా మీ ప్రతాపం! దమ్ములుంటే బయట చూపండ్రా! అసలు... అసలు.... మిమ్మల్ని ఒక్కొక్కణ్నీ..... నిజంగా పొడిచిపారెయ్యాల్రా.... పొద్దుటి దాకా రాజీ మాటలు మాట్లాడి ఇప్పుడు పోలీసు కనుపించగానే నోటికొచ్చినట్టు కూస్తార్రా!..... నేనసలు మర్డరు చెయ్యాలనుకున్నానో లేదో మీకు తెలీదట్రా, ఇడియట్స్!..... " - అఖువాహనం ఆవేశంగా చెయ్యెత్తి మొదటి గుంపు మీదికి వెళ్లబోయాడు. ఆ వెళ్లటంలో దెబ్బతిన్న ఉమాకుమార్ బుజానికి అతని చెయ్యి తగిలింది. ఆ గుంపు కుర్రాళ్లంతా భయపడిపోయి, వెనక్కి వెనక్కి జరిగి, తుపాకులు తగిలించిన స్టాండు పక్కన నక్కారు.

ఉమాకుమార్ ఏడుపు మొదలుపెట్టాడు : "చచ్చాన్నాయనోయ్!... నా భుజం ఊడదీసేసాడు దేవుడోయ్!... అయ్యో, చెయ్యి విరిగిపోయింది సార్... వీడు రాక్షసుడు బాబోయ్... వీణ్ణి, వీణ్ణి ... అమ్మో

నెప్పి.... బాబోయ్ నెప్పి.... ఈ చెయ్యి పోతే రేపు నేను బియ్యే పరీక్ష ఎట్లా రాయటం?.... మా బాబుకు నేనొక్కడ్నే కొడుకును సార్! ఈ దున్నపోతు నన్ను చంపేస్తానంటున్నాడు... రక్షించండి ఎస్సయిగారూ....'' - క్రమంగా భోరున ఏడుపులోకి దిగిపోయింది అరుపు

ఎస్.ఐ. చటుక్కునలేచి ముందుకు నడిచాడు : ''ఏయ్ ఆఖువాహనం, నాముందరే గంతులేస్తున్నావా? ఇది ఇంకో కేసవుతుంది జాగ్రత్త!''... ఆఖువాహనం వెనక్కు తగ్గాడు, ''ఆగండి! వెధవ నాటకం ఆడుతున్నాడు''. అంటూ ఇంతలో వార్డు కౌన్సిలరు, ఇంకో వ్యక్తి కలిసి లోపలికొచ్చాడు. వస్తూనే యస్.ఐ.కి విష్‌చేసి అన్నారు : ''ఈయన గణాధిపరావని నా బెస్టు ఫ్రండుసార్. దెందులూరు. అక్కడ పాతికెకరాల పొలమూ, పాడీ, ట్రాక్టరూ ''... ''రండి కూర్చోండి. పనేమిటో చెప్పండి.''

ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. కౌన్సిలరు అందుకున్నాడు : ఏం లేదు సార్... ఈ కుర్రాడు ఆఖువాహనం ఈయనగారబ్బాయే. ఇందాకన బాంకు పనిమీద ఈయన ఏలూరొస్తే ఎవరో కుర్రాళ్లు చెప్పారంట, మర్డరు కేసుమీద మీరు ఈళ్లందర్నీ తీసుకొచ్చేసారని... విషయమేంటంటే ... ఈ కుర్రోడు - ఆఖువాహనం - నాయకుడు కావచ్చు కానీండి, రాజకీయనాయకుడయ్యే లక్షణాలు మాత్రం బొత్తిగా లేవు సార్! ఎంచేతంటే, 'కాపీ కొట్టుకోవయ్యా,' అని వాచరంటే 'నీ చిన్నప్పుడు నువ్వు కొట్టి ఇప్పుడు మా ప్రాణం తీస్తున్నావు చాల్లేటయ్యా' అన్నవాడు ఈ కుర్రాడు. నాకు తెలుసు. అంచేత ఈ గొడవంతా కావాలని ఈ అబ్బాయి చేసాడని నేననుకోవట్లేదు...''

ఎస్.ఐ. అన్నాడు : ''అఫ్‌కోర్సు.... నేనూ అదే ఆలోచిస్తున్నాను. కానీ స్టూడెంట్సు కదా, ఒక డోసు తగిలించటం అవసరమేమోనని ఆలోచిస్తున్నాను.''... కౌన్సిలరు కుర్రాళ్లవైపు తిరిగి అన్నాడు : ''చందాలకోసం మీరు నిన్నటిదాకా కలిసి తిరిగారుకదా, ఇంతలో ఏం ముంచుకొచ్చిందని ఈ విరోచనాలు? నిజం చెప్పండయ్యా, ఈ యబ్బాయి నిజంగా మర్డరు ప్రయత్నం చేసాడా?''

వెంటనే ఎవరూ మాట్లాడ్లేదు. ఉమాకుమార్ నూతిలోంచి వస్తున్నట్లు స్వరంతో అన్నాడు : ''ఏమో! కాని కత్తి నాగ్గుచ్చుకుంది గదా మరి!''... కౌన్సిలర్ అన్నాడు : ''సార్, చూసారా, వీళ్లకి నిజంగా కక్షల్లేవు. వదిలెయ్యండి. వీళ్లని ఎట్లా కలపాలో నేను చూసుకుంటాను.''.... ఎస్.ఐ., ఉమాకుమార్ భుజంమీది కట్టు విప్పి చూసాడు. అది పెద్ద గాయం కాదు. బాకు మొన లోపలికి ఒక గోరువాసి తగిలిందంతే! ''సరే, దొమ్మీకేసు కింద రిజిష్టరు చేసుకుంటున్నాను. జామీను లేందే మాత్రం కుర్రాణ్ణి వదలను.''... కౌన్సిలరు, గణాధిపరావు వైపొకసారి చూసాడు. అన్నాడు : ''జామీను నేనుంటాలెండి.''

యస్.ఐ. అన్నాడు : ''ఇదుగో ఏకదంతం, ఈ కుర్రాడి ఒళ్లు కాలిపోతోంది. టూనాట్‌వన్‌ని పిలు. ఈ ఉమాకుమార్‌ని తీసికెళ్లి హాస్పిటల్‌లో జాయిన్ చెయ్యండి. అర్ధరాత్రిదాకా టూనాట్‌వన్‌ని అక్కడ బెడ్ దగ్గర సెంట్రీ ఉండమను. ఆ తర్వాత నువ్వెళ్లి అతన్ని రిలీవు చెయ్యి. మీరు ఈ కుర్రాళ్లతో గొడవపడితే ఊరుకోను. ఇదిగో ఈ కాగితాలు తీసికెళ్లు.'' యస్.ఐ కుర్రాళ్ళ అందరి అడ్రస్‌లూ, సంతకాలూ తీసుకున్నాడు. కౌన్సిలరు, గణాధిపరావుల నుంచి కాగితాలు రాయించి పుచ్చుకున్నాడు. ఆఖువాహనం వైపు చూసి ''ఇదుగో అబ్బాయ్, నేనసలు జామీనివ్వదలచుకోలేదు. అయినా ఇచ్చాను. కేసు తేలేదాకా నువ్వు ప్రతిరోజూ పొద్దునా సాయంత్రం వచ్చి కనిపించాలి. ఏ పూట కనిపించక పోతే ఆ పూట నేను ఈ కౌన్సిలరుగార్ని అడగాల్సుంటుంది. టేక్కేర్! మీరంతా వెళ్లొచ్చు. ఏకదంతం ఇతన్ని హాస్పిటల్‌కు తీసికెళ్లవయ్యా?''

అంతా నమస్కారాలు చెప్పి బయటకు కదిలారు. ఇందాకటి రిక్షావాడు అక్కడే ఉన్నాడు. ఉమాకుమార్ ఏబాధా లేనట్టు తేలిగ్గా, హుషారుగా రిక్షా ఎక్కేసాడు. రిక్షా కదిలింది. రెండోవైపు వెళ్లబోతున్న అఖువాహనం చటుక్కున వెనక్కు తిరిగి రిక్షా వెనక గుడ్డెత్తి 'చూస్కో ఏంచేస్తానో!' అన్నట్టు చూపుడువేలితో బెదిరించి, మీసం దువ్వి, పళ్లు పటపట కొరికి చటుక్కున వెనక్కి నడిచి తండ్రినీ, కౌన్సిలర్‌నీ కలుసుకున్నాడు. రిక్షాలో ఉమాకుమార్ బిక్కచచ్చిపోయాడు. ఈసారి నిజంగానే ఏడుపుమొహం పెట్టేసాడు.

★ ★ ★

రాత్రి పదకొండయింది. జనరల్ హాస్పటల్‌లో జనరల్ వార్డులో బెడ్‌మీద నిద్రపోతున్న ఉమాకుమార్ లేచాడు. లుంగీ సర్దుకుంటూ ఆదరాబాదరా వరండాలోంచి నడుచుకుంటూ లెట్రిన్స్ వైపు వెళ్లాడు. అక్కడే వరండాలో హెడ్డు టూనాట్‌వన్ గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. నైట్ డ్యూటీ నర్సూ, ఒక స్ట్రెచర్‌ను తోసుకుంటూ ఇద్దరు వార్డు బాయిస్సూ, వాళ్ల వెనక అఖువానమూ, వార్డులోకొచ్చారు. స్ట్రెచర్ మీది కుర్రాణ్ణి వినాయకరావు బెడ్ పక్కన, ఖాళీగా ఉన్న బెడ్‌మీదకి దింపి వార్డు బాయిస్ వెళ్లిపోగా, నర్సు కేసుషీటు తీసి బెడ్‌కు తగిలిస్తూ, "ఈ అబ్బాయి పేరు లంబోదరమా? కంగారు పడకండి.... ఇది అజీర్తి వల్ల వచ్చిన కడుపునొప్పి. ఎనిమా చేసాంగదా ఇంక భయంలేదు. పొద్దుటే డాక్టరుగారొచ్చి చూసాక డిశ్చార్జి చేస్తాం.... మీరు ఆ పోలీసు పక్కన పడుకోవచ్చు" అని వెళ్లిపోయింది.

అఖువాహనం, తన సంచీలోంచి దుప్పటి తీసి వరండాలోకి నడవబోయేసరికి బెడ్‌మీంచి దిగబోతూ లంబోదరం, "ఇస్స్, ఇస్స్, ఫోర్సుగా వస్తోందిరా, పద, పద" అన్నాడు. లంబోదరాన్ని కలుపుకుని అఖువాహనం వరండా చివరకు నడిచాడు. అక్కడ మలుపులో తను ఆగిపోయాడు. లంబోదరం ముందుకు నడిచి ఖాళీగా ఉన్న లెట్రిన్‌లోకెళ్లి తలుపేసుకున్నాడు. రెండు నిముషాలు గడిచాయి. మరో లెట్రిన్‌లోంచి చేతిగాయం బాధకు మూలుగుతూ ఉమాకుమార్ బయటకొచ్చాడు. వస్తూనే మలుపులో నుంచునున్న అఖువాహనాన్ని ట్యూబులైట్ కాంతిలో స్పష్టంగా చూసాడు. అఖువాహనం ఖాళీగాలేడు. వీపును గోడకాన్చి ఒక కాలు గోడకు తన్నిపెట్టి నుంచున్నాడు. ఒక చేత్తో తన మొండి చాకును పట్టుకుని, రెండో అరచేతిలో పదును నూరుతున్నాడు. యధాలాపంగా లెట్రిన్స్ వైపు ఓరగా చూస్తున్నాడు. ఎందుకనో పళ్లు బిగపట్టాడు. - ఈ అవతారంలో ఉన్నవాణ్ని చూడానే ఉమాకుమార్‌కు పైప్రాణాలు పైనేపోయాయి హఠాత్తుగా "అమ్మబాబోయ్, నన్ను చంపేస్తున్నాడండోయ్" అని ఒక్క గావుకేక పెట్టాడు. అరుస్తూ వెనక్కు అడుగేసి లెట్రిన్ తలుపు మూసెయ్యబోయాడు.

సరిగ్గా అప్పుడే అఖువాహనం కూడా ఉమాకుమార్‌ని గుర్తుపట్టాడు. చటుక్కున ఒక్కటే ఒక్క గంతేసి ఉమాకుమార్ కాలరు పట్టుకున్నారు. బయటికీడ్చాడు. గోడకాన్చిపెట్టి అన్నాడు : "రాస్కెల్, నేను నిన్ను చంపేస్తున్నానా? నిన్నిప్పుడు ఈ చాకుతోనే నిజంగా పొడిచేస్తాను. దిక్కెవడ్రా?"

ఉమాకుమార్ గుడ్లు తేలేసాడు. భయంతో వణికి పోతున్నాడు. " నన్నన్ను .. చంపకురా.. నీకు పుణ్యం ఉంటుంది. వదిలేయ్ ... ఒరేయ్... నన్ను చంపకురా!"

"మరి నన్ను జైల్లోకి తోసేసి నన్ను నాశనంచెయ్యాలని చూసావ్! నేనసలు నిన్ను మర్డరు చెయ్యాలని ప్రయత్నించానా?.. కక్ష ఎవరికిరా, నామీద నీకా, నీమీద నాకా? . చెప్పరా!" పొట్టలో చాకుతో పొడవబోయాడు అఖువాహనం.

"ఒద్దొద్దు పొడవకు నీ కాళ్ళు పట్టుకుంటాను... నువ్వు... నువ్వు అసలు మర్డరు చెయ్యాలనుకునేవాడివి కాదు. నాకు తెలుసు. కానీ.. కానీ.... ఆ హెడ్డూ లేడూ.. .. వాడు అట్లా చెప్పమన్నాడు. లేకపోతే నన్ను తంతానన్నాడు."..... "అట్లా దారికి రారా, పిగ్ హెడెడ్ ఇడియట్?" - కాలరు పట్టు వదిలేసాడు అఖువాహనం. బాకు మడిచి జేబులో పెట్టుకున్నాడు. "ఈ ఏడుపు ఇందాకనే ఏడిస్తే ఎంత బాగుండేది? ఇప్పుడు చూడు, నామీద కేసు! కౌన్సిలరుగారు జామీను! దేవాలయాని కెళ్లినట్టు నేను ప్రతి పూటా స్టేషనుకెళ్లి సెల్యూట్ కొట్టి రావటమూ, నీశార్థమూను! ఎందుకొచ్చిన గోలరా ఇదంతా? ఎన్నోమాట్లు మనం పూర్వం మాటా మాటా అనుకొన్నాం. కానీ ఇట్లా వీధి కెక్కామా? బతుకుల్ని తీసికెళ్లి పోలీసుల చేతుల్లో పెట్టుకున్నామా?.... అసలైనా నువ్వు చెప్పుడు మాటలు ఎందుకు వినినట్టు? మనం కలిసి చేద్దామనుకున్న వినాయక పూజను ఎందుకు చెడగొట్టినట్టు? పోనీ కలవకపోతేపోయావు, నా డెకరేషన్ మీదికి ఎందుకొచ్చినట్లు? నువ్వసలు మానర్‌లెస్ బ్రూట్‌వి... నిన్నసలు ... నిన్నసలు...." మోకాల్లో ఉమాకుమార్ పొట్టలో తన్నబోయాడు అఖువాహనం.

ఉమాకుమార్ హఠాత్తుగా అఖువాహనం కాళ్లమీద పడిపోయాడు. ఏడుస్తున్నట్టుగా అన్నాడు : "నన్ను క్షమించరా అన్నా!.... నన్ను నమ్ము.... బుద్ధి గడ్డితిని ఆ హెడ్డు చెప్పమన్నట్టు చెప్పాను. ఇంకెప్పుడూ నీతో పేచీ పెట్టుకోను... నన్నొదిలెయ్."..... "లేరా సన్నాసీ లే...." అఖువాహనం ఉమాకుమార్‌ను బుజం పట్టుకొని లేపాడు. లెట్రిన్ తలుపు తెరుచుకుని నీరసంగా ముక్కుతూ బయటకొచ్చాడు లంబోదరం. అతన్ని చూస్తూనే భయం భయంగా అయోమయంగా అన్నాడు ఉమాకుమార్. "వీడు.... వీడుకూడా.... నాకోసమే.... ఇక్కడికి... వచ్చాడా?"

"మళ్ళీ ఏడుపుమొహం పెట్టకు. వాడి బాధ వాడిది. హఠాత్తుగా కడుపునొప్పి వస్తే నేనే వాడిని హాస్పిటల్‌కి తీసుకొచ్చాను." అంటూ, "సరే..... ఇప్పుడు ఏం చేద్దామంటావ్?".... "నీ ఇష్టం వార్డులోకి పోదాం!" ఉమాకుమార్ అన్నాడు...."ఏడిసావ్, అర్భకపు వెధవా, విను! మనిద్దరి మీద అన్యాయం కేసుంది. ఎస్.ఐ. వదిల్నా హెడ్డుమన్ని వదల్డు, కనక మనం అసలు కొన్నాళ్లు వాళ్లకి కనబడకుండాపోతే?"

"పారిపోవటమా!... అమ్మో చెయ్యినొప్పి..... లాగేస్తోందే... స్స.... అబ్బా!..."...."మూతి పళ్లు రాలగొడతాను! ఇంకా తిక్కరేగితే ఆ చెయ్యికాస్తా విరిచేసి లెట్రిన్‌లో పారేస్తాను. డర్టీరోగ్! చెప్పినట్టు వింటావా, తన్నమంటావా?"... కంగారుగా అన్నాడు ఉమాకుమార్ - "వింటాను గురూ వింటాను. నూతిలో దూకమన్నా దూకుతాను."... "అయితే విను. ఈ లెట్రిన్ గొట్టాం పట్టుకుని కిందికి జారిపోదాం. ప్రహరీ గోడ దూకేసి కలక్టరాఫీసు మీదుగా తమ్మిలేరు గట్టు వెంబడి నడిచెళ్లి రెడ్డి కాలేజి దగ్గర లారీ ఎక్కుదాం. తిన్నగా బెజవాడెళ్లిపోదాం. ఏ లాడ్జిలోనో తలదాచుకుందాం. వీణ్ణి కూడా తీసికెడదాం. లేకపోతే ఈ వెధవ కూడా నీలాగే ఆ హెడ్డుకు లొంగిపోయి సాక్ష్యం చెప్పొచ్చు." లంబోదరం అన్నాడు - "మరి మీరిద్దరూ లేకపోయినా ఉమ్మడిగా పూజ్జేద్దామనీ దాన్ని నేను జరిపించాలనీ అందరమూ అనుకున్నామే!"....."ఇప్పుడు కాకపోతే మరొకప్పుడు మేమే జరిపిస్తాం లేరా దగ్గరుండి, సన్నాసీ!.... దీపావళికి చేద్దాంలే. అసలు మనలో కలయిక అనేదే ఉండాలి కానీ అవకాశాలే లేవా?"

పావుగంట తర్వాత ఆ ముగ్గురు లారీలో విజయవాడ వైపు ప్రయాణంలో ఉన్నారు.

★ ★ ★

తెల్లారి ఆరయింది. ఇద్దరు హెడ్ఫులూ యస్.ఐ. ఇంట్లో చేతులు కట్టుకొని నుంచునున్నారు యస్.ఐ. వాళ్లని చచ్చేటట్టు చివాట్లు పెడుతున్నాడు : "అంటే వాళ్లున్నారో లేదో చూసుకోకుండానే మీరు ఒకళ్ళనొకళ్ళు కావిలించుకుని అక్కడ పడి నిద్రపోయారన్న మాట! వాళ్లిద్దరూ, కాదు - వాళ్లు ముగ్గురూ కలిసే పారిపోయారన్నమాట! అసలు ఆలోచించి చూస్తే వాళ్లిద్దరి మధ్యా శతృత్వం అనేది కూడా తాత్కాలికంగా ఎవరో కల్పించిందేనన్నమాట! ఆ పుణ్యం ఏదో నువ్వే కట్టుకొనుండొచ్చు. నిన్ననే నాకీ విషయంలో అనుమానం కలిగింది. ఏమంటావ్ ఏకదంతం?... నువ్వీ డర్టీ కేసును నీ ప్రమోషను కోసం పట్టుంటావ్, నాకు తెలుసు. నీకు ప్రమోషను కావాలంటే రెండు దొంగనోట్ల కేసుల్లో, తెగించి కత్తుల్లాంటి రెండు థెఫ్ట్ కేసుల్లో పట్టుకోవయ్యా అని ఎప్పుడో చెప్పాను. ఈ కుర్రాళ్ల కేసులేం కేసులయ్యా! అళ్లివ్వాళ విడిపోతారు, రేపు కలుస్తారు. పైగా అసలు వినాయకుడి పూజచేసే వాళ్లే కరువైపోతూన్న రోజులుగదా ఇవ్వి! ఆ ఇద్దర్నీ కలిపి చక్కగా పూజ్జేయించి ఓ నాలుగు కొబ్బరి చెక్కలు స్టేషనుకు తెచ్చుకుంటారా, లేకపోతే ఆళ్లని చీల్చి ఆళ్ల చేత పూజ ఎగ్గొటిస్తారా!.... గుర్తుంచుకో, ఎప్పటికైనా మన బతుకులు బాగుపడాలంటే, దేశం బాగుపడాలంటే డిసిప్లినున్న స్టూడెంటు కుర్రాళ్లే మనకి దిక్కు. ఆళ్లు కలిసుంటం అవసరం. ఆళ్లకి దైవభక్తి ఉంటం అవసరం... ఏకదంతం! వార్నింగిస్తున్నాను. ఇకనుంచీ ఇటువంటి దిక్కుమాలిన కేసులు తెచ్చావో రివర్షను అయిపోతావు జాగ్రత్త. ఫో!" - యస్.ఐ. లోపలికెళ్లిపోయాడు.

"చవితి చంద్రుణ్ణి చూళ్లేదు. అసలింకా దేవుడికి కొబ్బరికాయే కొట్టుకోలేదు. ప్రమోషన్ పోయి రివర్షన్‌లోకొచ్చిందా నా జాతకం! ఖర్మరా, టూనాట్‌వన్, నా ఖర్మ!" అని గొణుక్కుంటూ బయటికి నడిచాడు ఏకదంతం.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక 7-1-83)

★★★ ★★★ ★★★

# మన్మధుని బోను

ఎత్తు ఆ కొండల సొత్తు. ఒత్తు ఆ అడవుల సొత్తు. కొత్త ఆ ఫియట్ సొత్తు. మరి, మరి కళ్లు అ,...అ.. మగువ సొత్తు! పాపికొండల వైపుగా మారేడుమిల్లికి పదిహేను మైళ్ళ దూరంలో ఎత్తయిన కొండల మీద ఇప్పచెట్లు, వెదురు చెట్లున్న ఆ రెండొందల ఎకరాల లోయలో అగ్ని వర్షం కురిపిస్తునట్లు పూలు రాలుస్తున్న కడిమి చెట్టు కిందకొచ్చి ఆగింది జీపు. రెండు పొడవాటి ఆస్ బెస్టాస్ షెడ్లూ, ఒకడజను కాన్వాసు గుడారాలు ఆ చెట్టు చుట్టూ ఉన్నాయి. జీపాగిన నాలుగు క్షణాల తర్వాత ఫియెట్ కారొచ్చి దాని పక్కనే ఆగింది.

జీపులోంచి దిగిన బుజురాయ్, కార్లోంచి దిగుతున్న ఆ ముప్పయ్యేళ్ళ మత్తు కళ్ళ మెరుపు తీగను చూసాడు. చూస్తూనే అతని కళ్ళు ఆమె ఒంటికి అతుక్కుపోయాయి. అంతకుముందే స్లీవ్‌లెస్ బ్లవుజ్ , సీత్రూ చీర, బన్ను ముడి, మొగిలి సెంటు అతుక్కుపోయిన ఆ దంతపు రంగు శరీరానికి బుజురాయ్ చూపులు కూడా అతుక్కుపోవటంలో ఆశ్చర్యం లేదేమో!